# మెరిసిన మేఘం

నందిరాజు పద్మలతా జయరాం

రాత్రి ఎనిమిది దాటుతోంది.

ఫ్లోరిడా స్టేట్ లోని టెనేస్సే నగరం చీకటి ముసుగు కప్పుకుని చాలా సేపయింది. అపార్ట్‌మెంట్స్ లోంచి ప్రవహించే వెలుతురు నల్లని చీకటి చెరగు మీద నక్షత్రాల్లాంటి కాంతిరేఖలు అలముకుంటున్నాయి.

ముచ్చటగా మ్రోగిన కాలింగ్‌బెల్‌ని విని నెట్ ఛాటింగ్ చేస్తున్న స్టేసీ తలుపు తీసింది.

అలసిన కళ్ళతో ఒకింత నీరసంగా లోపలికి అడుగుపెట్టింది అనుపమ.



''హాయ్! ఏమిటంత డల్‌నెస్ బేబీ? ఎందుకింత ఆలస్యం?''

స్టేసీకి చిరునవ్వునే సమాధానంగా ప్రెజెంట్ చేసి తన గదిలోకి వెళ్ళిపోయింది అనుపమ.

అనుపమ స్టేసీ రూమ్మేట్స్. ఇరవై నెలలు డెప్యుటేషన్ మీద భారతదేశం నుండి వచ్చింది అనుపమ. అప్పటికే ఆమెకు స్టేసీతో నెట్ పరిచయం వుంది. ఇంకా ఎనిమిది నెలలలో అనుపమ తిరిగి భారత్ వెళ్ళిపోతుంది.

''ఏమిటి అప్పుడే పక్కేశావ్? వంట చేశాను. రా!'' గుమ్మంలో నుండే పిలిచింది స్టేసీ.

''సారీ స్టేసీ! బైట తిన్నాను. బాగా నిద్రొస్తోంది. నువ్వు తినెయ్'' అప్పటికే నిండుగా దుప్పటి కప్పుకుంది అనుపమ.

''ఇట్సోకే! గుడ్ నైట్ స్వీటీ!'' అనుపమ నుదుట ముద్దిచ్చి వెళ్ళిపోయింది స్టేసీ.

అనవసరపు వివరాలడగని స్టేసీ అమెరికన్ నేచర్ అంటే అందుకే ఇష్టం అనుపమకి.

గట్టిగా కళ్ళు మూసుకుంది. అయినా సాయంత్రం తనతో మిళింద్ మాట్లాడిన విషయాలే గుర్తొస్తున్నాయి. తనలాగే తమ కంపెనీ నుంచే పూనే నుంచి డెప్యుటేషన్ మీద ఆన్‌సైట్ ప్రాజెక్ట్ వర్క్ కోసం వచ్చాడు మిళింద్. మంచి కలుపుగోలు మనిషి. నవ్వుతూ నవ్విస్తాడు. జీవితం అపురూపమైనది. అది ముడుచుకుని బ్రతికేందుక్కాదు, మనసంతా సంతోషంగా నలుగురితో పంచుకోడానికే అన్నట్లుంటాడు. అమెరికా వచ్చిన కొత్తల్లో అపరిచితులు కూడా 'హలో' అంటూ తనను చిరునవ్వుతో విష్ చేస్తుంటే, ఎబ్బెట్టుగా ఫీలయ్యేది అనుపమ. ఇక ఈ మిళింద్ పాలక్ చొరవ చూస్తుంటే మరీ కంపరంగా అనిపించేది. కానీ, వచ్చిన నెల రోజులకే తను హోమ్‌సిక్‌నెస్‌తో జ్వరం తెచ్చేసుకుంటే, అతనే ఆదుకుని సాయం చేసేసరికి ఆ స్నేహాన్ని అర్థం చేసుకుంది.

ఆ సాయంత్రం రెస్టారెంట్‌లో తనకి చిన్న పార్టీ ఇచ్చాడు మిళింద్. దాదాపు ప్రతి బల్లా నిండిపోయింది మనుషులతో. అయినా గాజు గ్లాసుల శబ్దాల మధ్య గుసగుసల సడి తప్ప అంతా నిశ్శబ్దమే!

''అమ్మతో మాట్లాడారా? ఏమన్నారు?'' బేరర్ తెచ్చిన కోక్‌ని అనుపమకిచ్చి, తన గ్లాసులోకి వైన్ ఒంపుకుంటూ అడిగాడు మిళింద్.

''ఊహు! నేనే ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. ఐ థింక్ ఐ నీడ్ టైం'' చెప్పింది అనుపమ.

''టేక్ యువర్ ఓన్ టైం. కానీ తొందరపడి 'నో' అని చెప్పొద్దు. ప్లీజ్!'' ఆమె చేతిలో తన చేతినుంచాడు.

ఓ సారి కనురెప్పలు ఎత్తి అతన్ని చూసి తిరిగి తలొంచుకుంది అనుపమ.

''యస్! అనూ! మీ కళ్ళల్లో కదలాడే అనుమానాల పరంపర నా కర్థమైంది. నేనేమీ ప్రేమ మైకంలో కొట్టుకుపోతున్న టీనేజ్ బాయ్‌ని కాదు. నాకు తగిన వ్యక్తిగా మీరు కనిపించారు. నా తల్లిదండ్రుల్ని ఒప్పించగల ధైర్యం నాకుంది. 'నేను మీకు నచ్చాను' అన్న మరుక్షణం నాకింకేం అక్కర్లేదు. మీ గతం అవసరం లేదు. మిమ్మల్ని, మీ బాధ్యతలతో సహా ఆనందంగా స్వీకరిస్తాను'' నమ్మకంగా అన్నాడు మిళింద్.

''మిళింద్! నేను పన్నెండేళ్ళ పాపకి తల్లిని. మీరో అవివాహితులు. నేటి ఆకర్షణ చెరిగిపోతే, మొదటికొచ్చే నా దౌర్భాగ్య జీవితాన్ని మళ్ళీ అనుభవించే శక్తి నాకు లేదు. కాస్త ఆలోచించుకోనివ్వండి.''

''అనూ! మీరూ నేనూ ఒకటయ్యాక 'మహిత' నాకు మాత్రం కూతురు కాదా! గత పదేళ్ళుగా మా వాళ్ళు నన్ను ఎంత పోరినా నచ్చిన అమ్మాయి దొరక్క బ్యాచిలర్‌గా వుండిపోయాను. మీకు నమ్మకం కలగాలంటే, చెప్పండి! నేనేం చేయాలి?'' ఒకింత ఆవేశంగా అన్నాడు మిళింద్.

''నన్ను ఆలోచించుకోనివ్వండి ప్లీజ్!'' హ్యాండ్‌బ్యాగ్ భుజాన వేసుకుంది అనుపమ, ఇక ఆ టాపిక్ చాలన్నట్లు.

నిద్రరాని అనుపమకి ఊగిసలాడుతున్న మనసుని నిద్రపుచ్చడమెలాగో తెలియడం లేదు. మిళింద్ మంచివాడే కానీ సంస్కృతులు, సాంప్రదాయాలు వేరు. ఏ తల్లిదండ్రులూ, తమ బిడ్డ రెడీమేడ్ తల్లిని తెచ్చి ఇదిగో మీ కోడలు అంటే హర్షించరు. తను పరువం పదునెక్కిన పదహారేళ్ళ పడుచు కాకపోయినా, వయసుడిగిపోయిన ముసలమ్మ కాదుగా! ముఫైరెండేళ్ళ వయసుకే అన్నీ ముగిసిపోయాయంటే బాధ కల్గుతూనే వుంది. ఇది మరో వసంతంగా మలుచుకోవచ్చు. కానీ, రాబోయే జీవితంలో కాబోయే అనుభవాల్ని తలచుకుంటేనే భయం కల్గుతోంది.

ఆలోచిస్తూనే మాగన్నుగా నిద్రపట్టింది అనుపమకి. అందులోనే కల. కల కాదు. కలే అయితే బాగుండేదేమో అనిపించే చేదు నిజం.

***

తలుపు తీసిన పదహారేళ్ల అనుపమకి ఎదురుగా కనిపించాడు ఎదురింటి ఆనంద్.

''అన్నయ్య కోసమేనా? వాడు లేడు. ఈ టైంలో కాలేజ్‌లో వుంటాడు'' అనేసి తిరిగి అతని ముఖాన్నే తలుపు వేసింది అనుపమ.

''ఏమిటే ఆ మొరటుదనం? తప్పు కాదూ!'' మందలించింది అనుపమ తల్లి పుష్ప.

''మరేంటమ్మా? అన్నయ్య ఈ టైంలో ఎక్కడుంటాడో అతనికి తెలీదా! కావాలని డిస్టర్బ్ చేస్తాడు. నాకొళ్ళు మండుతుంది''

''కానీలేమ్మా! ఆ పిల్లాడికి ఇంటర్ తప్పినప్పటి నుంచీ ఇంట్లో ఏం తోచడం లేదు. వాళ్ళమ్మేమో ఎక్కడో పోచంపల్లి కాలేజీకి ప్రొద్దుననగా వెళ్ళి రాత్రిగ్గానీ ఇల్లు చేరదు. తండ్రి దుబాయ్, అక్క ముంబాయి. వాడి మీద జాలి పడాలి తప్ప కోపం కూడదే!'' సముదాయించింది తల్లి.

''ఏమో అమ్మా! అతను నాతో మాట్లాడడం కోసమే వేషాలేస్తున్నాడనిపిస్తుంది'' అంటూనే పుస్తకం తీసుకుని గదిలోకి వెళ్ళిపోయింది అనుపమ.


ఇండిర్మీడియట్ మొదటి సంవత్సరం గడిచి రెండో సంవత్సరానికి వచ్చింది అనుపమ. ఎదురింటి ఆనంద్, అనుపమ అన్నయ్య కిరణ్ తోటివాడు. కానీ మళ్ళీ ఫెయిలయి ఇపుడు ఇంటర్మీడియట్ పరీక్ష మూడోసారి రాస్తున్నాడు. సన్నగా, పీలగా వున్నా చదువు తప్ప మిగతా విషయాల్లో చురుకైన కుర్రవాడే ఆనంద్. కిరణ్‌తో కలిసి సినిమాలకి, షికార్లకి తిరిగేవాడు. కబుర్లు చెప్పడానికి ఇంటికి వచ్చేవాడు. ఒక రోజు అనుపమ తల్లి అనుపమని పిలిచి 'పాపం ఆనంద్‌కి లెక్కల్లో అనుమానాలున్నాయ్యట. కాస్త చెప్పి పుణ్యం కట్టుకోవే! ఈ సారైనా పాసవుతాడు. వాళ్ళమ్మ నన్ను బ్రతిమాలాడుతోంది' అనడంతో తప్పనిసరై ఒప్పుకుంది అనుపమ.

''అనూ! నువ్వు చెబుతూంటే ఎంత తేలిగ్గా అనిపిస్తోందో నాకు. మా లెక్చరర్స్ గనుక ఇలా టీచ్ చేస్తే ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యేవాడిని'' అన్నాడు ఆనంద్.

''అనూ! నా మీద నీకున్న సానుభూతి మా అమ్మా, నాన్నలకే ఉంటే, మంచి ట్యూషన్ పెట్టించి నన్ను పాస్ అయ్యేటట్లు చూసేవాళ్ళు'' మరోసారి అన్నాడు.

ఆనంద్ పట్ల జాలితో నిండిపోయింది అనుపమ. ఇద్దరూ కలిసి చదివేవాళ్ళు. తల్లి తన ప్రిన్సిపల్ ఉద్యోగ బాధ్యత వల్ల, తండ్రి దూరంగా ఉండడం వల్ల, అక్క పెళ్ళయి వెళ్ళిపోవడం వల్ల ఆనంద్‌కి జరిగిన అన్యాయం, అతని జీవితంలో ఎంత నష్టాన్ని కలగజేసిందో తల్చుకుని బాధపడింది.

''నిజం అనూ! మా అమ్మ ఒక్కోరోజు వంట



కూడా చేయదు. నా దగ్గర డబ్బులెక్కడుంటాయ్? అందుకే చాలా సార్లు అన్నం కూడా తినను. ఆకలి తోనే ఇంట్లో వుంటాను. మా నాన్న ఏం సంపాదిస్తాడో ఏమో గానీ, ఇంటికి పైసా పంపడు. చదువులో వెనక బడ్డాను కదా! చుట్టాలక్కూడా నేనంటే లోకువ. మా అక్క ఫోన్‌లో కూడా నన్ను పలకరించదు. నాకు చావాలనిపిస్తుంది.''

ఆనంద్ కన్నీళ్ళు అనుపమను ఆర్తిలో ముంచే సేవి. అమ్మా, నాన్నల ప్రేమ కరువైన వాళ్ళ బ్రతుకు లెంత దుర్భరమో అనిపించి ఆ మమకారం కొంతైనా తను పంచగలుగుతే అతను బాగుపడతాడనిపించేది. తన నోట్సులు, స్టడీ మెటీరియల్ అతనికిచ్చి చదవ మని పోరేది.

ఎలాగైతేనేం, ఆనంద్ ఇంటర్మీడియట్ పాస య్యాడు. డిగ్రీలో చేరాడు. అనుపమ ఇంటర్మీడియ ట్‌లో డిస్టింక్షన్ తెచ్చుకుని ఇంజనీరింగ్‌లో చేరింది. మొదటి సంవత్సరం పూర్తయ్యేలోగా ఆనంద్, అనుప మకి మరింత దగ్గరయ్యాడు. అతని అమాయకపు ముఖం, తనని చూడగానే అతనిలో కనిపించే ఆనందం అనుపమ హృదయానికి అపురూపంగా తోచేవి. తను లేకపోతే అతనేమైపోతాడో అన్న ఆత్మీ యభావన కూడా కలిగేది. ఏమైతేనేం, అనుపమ ఆనంద్ మైకంలో పడి చదువును కూడా నిర్లక్ష్యం చేయసాగింది. ఈ ప్రేమ విషయం ఇద్దరి ఇళ్ళల్లోనూ తెలిశాక ఘర్షణ మొదలైంది.

''పద్దెనిమిదేళ్ళు లేవు. అప్పుడే ప్రేమేమిటి? అసలు ఆ మొద్దు వెధవతో తిరుగుళ్ళేవిటి? చంపే స్తాను'' అరిచాడు అనుపమ తండ్రి.

''నాన్నా! ఆనంద్‌కి కొద్దిగా తాగుడలవాటుంది. సిగరెట్ కూడా అలవాటుంది. వాడు నా ఫ్రెండ్ కనుక నాకు వాడి సంగతి తెలుసు. ఏ విషయంలో సీరి యస్‌గా తీసుకోడు''. చెల్లికి హెచ్చరికగా సూచిస్తూ తండ్రితో అన్నాడు అనుపమ అన్నయ్య కిరణ్.

''అనూ! అనవసరంగా జీవితంలో నిప్పులు పోసుకోకు. వాళ్ళమ్మ మీద సానుభూతితో వాడికి సాయపడమన్నానే కానీ, నువ్వింతగా పిచ్చి ప్రేమలో కూరుకుపోతావనుకోలేదు. వద్దమ్మా!'' బ్రతిమలాడింది అనుపమ తల్లి పుష్ప.

ఎవరేం చెప్పినా వినలేదు అనుపమ. ఎదిగీ ఎద గని వయసులో కురిసిన అనురాగపు తొలకరికి ఆమె తడిసి ముద్దయ్యింది. ఆనంద్ తప్ప మిగిలిన వాళ్ళె వరూ తనకిక అవసరం లేదనిపించింది. చిన్నాన్నలు, మేనమామలు అనుపమని తమ ఇళ్ళకి తీసికెళ్ళి మరీ చెప్పి చూశారు.

''చూడండి! మీరెందుకింత ఆరాటపడుతున్నారో నాకు తెలుసు. ఆనంద్‌కి ఉద్యోగం లేదనేగా! నన్నెలా పోషిస్తాడో అన్న అనుమానంతో భయపడుతున్నారు. నాకా భయం లేదు. నేను చదువు పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకుంటాను. అప్పటి వరకూ ట్యూషన్లు చెప్పుకుని బ్రతుకుతాం. అతన్ని కాదని నాకు మరో పెళ్ళి చేయడానికి చూసినా, ఆనంద్‌కి హాని తలపె ట్టినా, నేను కాదు, నా శవమే మిగుల్తుంది'' ఖరాఖం డీగా చెప్పేసింది అనుపమ.

ఆఖరికి ఆనంద్ తల్లి కూడా అనుపమ మనసు మార్చడం కోసం ప్రయత్నించింది.

''అమ్మా! అనుపమా! నువ్వేం చూసి వాణ్ణి ప్రేమించావో నాకు తెలీదు. వాడికి చదువు సరిగ్గా లేదు. ప్రవర్తనా సరిగా లేదు. నా పెంపకం లోపమే అయ్యుంటే వాడి అక్క ఇవాళ అంత పెద్ద ఉద్యోగం చేస్తూ, చక్కగా కాపురం చేసుకుంటే ఉండేది కాదు గదా! వీడు చెడు స్నేహాల వల్ల పాడయిపోయాడు. సరైన దారిలో వుంటే తండ్రేమో సంపాదన కోసం దూరదేశాల్లో వున్నారు. నా మాటవిని బాగుపడే స్థితి దాటిపోయిన ఆనంద్ కోసం నవ్వు నీ బంగారు భవి ష్యత్తు పాడు చేసుకోకు. ఎంతోమంది విద్యార్థులకి మార్గదర్శనం చేసిన టీచర్‌ని నేను. పిల్లల మనస్త త్వాన్ని బట్టి వాళ్ళ భవిష్యత్తు ఎటు తిరుగుతుందో నేనూహించగలను. మా వాడితో నీకు ఏ సుఖమూ వుండదు. మనసు మార్చుకో! నిజానికి వాడే నాకు పెద్ద బరువు. వాడికి తోడు నిన్నూ నా నెత్తిన మరో బరువుగా మోయడం నా వల్లకాదు''.

ఆనంద్ తల్లి నిర్మొహమాటంగా చెప్పిన విషయా లేవీ అనుపమ తలకెక్కలేదు. తల్లి ప్రేమరాహిత్యం వల్లనే ఆనంద్ అలా తయారయ్యాడనీ, తన అను రాగ ఛాయలో అతను బంగారు జీవితం వైపు వడిగా నడుస్తాడనీ, తను అతనని అనుసరించి వుండి పొద రింట్లో గువ్వల్లా కాపురం చేస్తామనీ అందరితో వాదిం చింది.

తాము కాదన్నా అనుపమ అతన్ని వదలుకోదని అర్థమయ్యాక పెద్దలు వాళ్ళిద్దరినీ పెళ్ళి పేరుతో ఏకం చేశారు.


ఏడాది గడిచింది. అనుపమ ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతూండగానే గర్భవత యింది. ఆనంద్ మాత్రం డిగ్రీ మొదటి సంవత్స రంతో సహా మూడో సంవత్సరం వరకూ దాదాపు ప్రతి సబ్జెక్టూ తప్పాడు. భర్తకి తెలియకుండా సాయం చేస్తూ వచ్చిన అనుపమ తల్లిని ఇపుడు ఆయన కట్టడి చేయడంతో అది కూడా మానేసింది. ఆనంద్ తల్లి మొదట్లోనే కొడుకుతో తెగతెంపులు చేసుకుంది. పెళ్ళికి ముందు చంటి పిల్లాడిలా ఏడ్చి అనుపమను లోబర్చుకున్న ఆనంద్ ఇపుడు అనుపమ కంట నీరు తెప్పించని రోజేలేదు. ప్రతి నెలా ఇంటి అద్దె, ఇంటి ఖర్చులు, చదువు ఖర్చులు వాటికి తోడు గర్భిణిగా వాడాల్సిన మందుల ఖర్చులు – వీటితో అనుపమ ఒంటి మీద బంగారం, పట్టు చీరలూ అన్నీ అమ్ముడ యిపోయాయి. ఉదయం, సాయంత్రం ట్యూషన్లు చెప్పినా సంపాదన చాలడం లేదు. ఆనంద్ తాగుడికి ఎంత డబ్బూ సరిపోవడం లేదు. అనుపమ లేని సమయం చూసి ఇంట్లోని పప్పూ, ఉప్పూ కూడా కిరాణా దుకాణాల్లో అమ్మేసి కల్లుకాంపౌండులో తాగి తూలుతూ ఏ రాత్రో ఇల్లు చేరుతున్నాడు. ఇంతకు ముందు అమృతపు చినుకుల్లా అనిపించిన అనుపమ పలుకులు అతనికిప్పుడు పొగరెక్కిన మాటల్లా అనిపి స్తున్నాయి. ఆమె కోపగించినా, మందలించినా అత నిలో సుపీరియారిటీ కాంప్లెక్స్ పెరిగి పురుషాహంకా రాన్ని రెచ్చగొడుతున్నాయి. ఫలితంగా నిండు గర్భి ణికి ఒంటినిండా వాతలు తేలుతున్నాయి. స్వయం కృతాపరాధానికి క్రుంగిపోతూ శవంలా బ్రతుకీడు స్తోంది అనుపమ.

పురుడొచ్చే సమయానికి అనుపమ తల్లి హృదయం ఆగలేకపోయింది. భర్తని ఎదిరించి మరీ కూతుర్ని కాన్పుకి తీసుకు వెళ్ళింది. మహిత పుట్టింది. ఆ తర్వాత ఆనంద్ ఎన్నోసార్లు బ్రతిమలాడాడు. మరోసారి తప్పు చెయ్యననీ, ఏదో ఒక చిన్న ఉద్యోగం చేస్తూ భార్యా పిల్లల్ని ప్రేమగా చూసుకుంటానని కాళ్ళావేళ్ళా పడ్డాడు. లొంగిపోయిన అనుపమ మరో సారి భంగపడి తిరిగి పుట్టింటికే చేరింది. ఇక ఆ తర్వాత అతని ముఖం చూడలేదు. ఆగిపోయిన ఇంజ నీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం సంపాదించుకుంది. విడా కులు పొందిన అయిదారు నెలలకే ఆనంద్ లివర్ క్యాన్సర్‌తో పోయాడని తెలిసి, మహితకి తండ్రి లేడే అని మాత్రమే బాధపడింది.

***

పీడ కలలా తోచిన గతాన్ని గుర్తు చేసుకుంటున్న అనుపమకి ఇక రాంత్రంతా నిద్రపట్టలేదు. తెలిసీ తెలి యని వయసులో జరిగిన పొరపాటుకి నూరేళ్ళ జీవితాన్ని పణంగా పెట్టవలసిందేనా! అవసరం లేదు. ఎండిన మోడు తిరిగి పుష్పిస్తుంది. మధుర రాగాన్ని పంచుతుంది.

మిళింద్‌తో తనకి ఏడాదిగా పరిచయం. అత నిలో వెతికినా ఒక్క లోపమూ లేదు. తనను కావాల నుకునే వ్యక్తిని చేజేతులా దూరం చేసుకోవడం అవి వేకం. చేజార్చుకున్నానన్న పశ్చాత్తాపం మిగల కుండా వుండాలంటే సరైన సమయంలో సరైన



నిర్ణయం తీసుకోవాలి. తను 'ఔను' అంటే!

ఔను అతన్ని కాదన్నంత మాత్రాన తనకు ఒరిగేదేం లేదు. ఈ మోడులాంటి జీవితాన్ని మరోసారి చిగురించనివ్వడం తప్పేం కాదు. ముఖ్యంగా మహిత పట్ల అతను చూపుతున్న కన్‌సర్న్ చాలా బావుంది. మొన్నామధ్య తనకు తెలీకుండానే దానికి నిలువెత్తు బార్బీ బొమ్మని పుట్టినరోజు కానుకగా పంపాడని మహిత ఫోన్లో చెప్తే తెలిసింది. ఇక చాక్లెట్లూ, గ్రీటింగ్ కార్డ్సూ సరేసరి! ఔను. ఇక ఆలస్యం చేయడం అనవసరం. మిళింద్‌కి 'యస్' చెప్పేస్తాను. అతని ముఖంలోని వెలుగుకి ఆస్వాదిస్తాను. నిర్ణయాన్ని మరోసారి మననం చేసుకుంటూ దిగ్గున పక్క మీంచి లేచింది అనుపమ.

''వావ్! యూ ఆర్ లుకింగ్ గార్జియస్! ఎనీ థింగ్ స్పెషల్?'' అడిగింది స్టేసీ!

''యా! ఎవ్విరిథింగ్ ఈజ్ స్పెషల్!'' విషయం చెప్పకుండా ఊరిస్తూ అంది అనుపమ.

''అవెయిటింగ్ ఫరాన్ ఎగ్జాస్టిక్ ట్రీట్ మై డియర్!'' అనుపమ చేతిని ప్రేమగా నొక్కింది స్టేసీ.

అనుపమ మనసు గాలిలో తేలిపోతోంది. ఎవరి కోసమూ ఆగని కాలం తన కోసం వెనక్కెళ్ళి మరీ పరువాన్ని వెతుక్కొచ్చి బహూకరించినట్లు అనిపించిందామెకి. ఎడారిలా మారిన హృదయంలో మందాకినీ సలిలంలా ప్రవహించిన మిళింద్ రూపం ఆమెలో మరచిపోయిన కోర్కెలను మేల్కొల్పుతోంది. రోజూ విసుక్కుంటూ తినే బ్రెడ్ టోస్ట్, ఈ రోజెందుకో అమ్మ ప్రేమగా చేసిపెట్టిన పరమాన్నంలా అనిపిస్తుంటే తృప్తిగా తిని ఆఫీస్‌కి బయల్దేరింది.

ఎస్కలేటర్‌లో క్రిందికి దిగుతూంటే మ్రోగింది మొబైల్.

''హలో! అమ్మా! చెప్పు! మహిత బావుంది కదా!'' ఇండియా నుంచి తల్లి ఫోన్‌ని అందుకొని అడిగింది అనుపమ.

''నీ కోసం రాత్రి నుంచీ ప్రయత్నిస్తున్నానే! స్విచ్ ఆఫ్ చేసినట్లున్నావు ఫోను. నెట్ కూడా వాడినట్లు లేవు. లాభం లేదని ఆన్‌లైన్ మెసేజ్ ఇచ్చాడు కిరణ్. ఏమిటంత బిజీ? కులాసే కదా!''

''అవునమ్మా! నిన్న కొంచెం బిజీనే! మిళింద్ అని నా ఫ్రెండ్ పార్టీ ఇస్తే వెళ్ళాను. రాత్రి కాస్త ఆలస్యమయింది. నేనే నీకు ఫోన్ చేసి ఒక ముఖ్య విషయం చెప్పాలనుకున్నాను. నా జీవితంలో ఒక ముఖ్య సంఘటన జరగబోతోందని, నీ అంగీకారం కోసం అడగాలనీ అనుకున్నాను. ఇంతకీ, నువ్వు చెప్పాలనుకున్న విషయం చెప్పు ముందు'' క్యాబ్‌లోకి ఎక్కబోతూ ఆనందాన్ని అణచిపెట్టుకుంటూ అడిగింది అనుపమ.

అనూ! నీకో శుభవార్త. మన మహిత పెద్దదయింది నిన్న ప్రొద్దున్నే! నీకు రావడం కుదురుతుందా!''

మ్రాన్పడిపోయింది అనుపమ. మహిత, తన చిన్నారి మహిత అప్పుడే వ్యక్తురాలైందా! కళ్ళ ముందే నిన్న మొన్నటి దాకా తప్పటడుగులు వేసిన పసికందు అప్పుడే స్త్రీత్వాన్ని పొందిందా?

''మాట్లాడవేమే! రావడం కుదురుతుందా అని అడుగుతున్నాను'' మళ్ళీ అడిగింది పుష్ప.

అంత దిగులుగా వున్నా ఆ ప్రశ్నకి నవ్వొచ్చింది అనుపమకి, తనేమైనా పక్క ఊళ్ళో వుందా, అనుకోగానే రావడానికి.

''కుదరదమ్మా! దానితో తర్వాత మాట్లాడతాన్లేమ్మా! జాగ్రత్త'' చెప్పింది అనుపమ.

''సర్లే నీ ఇష్టం! అన్నట్లు ఎవరు అనూ ఆ మిళింద్? పాపకి గిఫ్ట్సూ అవీ పంపుతున్నాడుట? నీకు ఫ్రెండట కదా! జాగ్రత్త అనూ! ఒకసారి దెబ్బతిని వున్నావు. మళ్ళీ అదే పొరపాటు చెయ్యకు'' హెచ్చరించింది పుష్ప.

''అతను... అతను చాలా మంచివాడమ్మా! నా కొలీగ్'' ఇంకా ఏదో చెప్పబోయింది అనుపమ.

''చూడు అనూ! ఎంత మంచి వాళ్ళయినా నీ జీవితంలో పెళ్లి అనేది ముగిసిపోయిన అంకం. ఇప్పుడు నీ కూతురూ పెద్దవుతోంది. ఎవరినో తెచ్చి 'నీ తండ్రి' అంటే అది ఒప్పుకోదు. అవతలి వ్యక్తి దృష్టి ఎలా వుంటుందో ముందుగా ఊహించడం అసాధ్యం. అలా అని ఈ వయసులో నీ బిడ్డని నా దగ్గరే వుంచుకుని పెంచే సామర్థ్యం నాకు లేదు. మీ నాన్నా ఒప్పుకోరు. నీ జాగ్రత్తలో నువ్వుండు'' పుష్ప ఫోన్ పెట్టేసింది.

ఊహల ఊయల అకస్మాత్తుగా నేల జారింది. చివురెత్తున్న ఆశల పూల మొక్క మొదలంతా వాడిపోయిన భావన. తెలిసీ, తెలియని వయసులో విరిసిన ప్రేమతాకిడి, ఇన్నాళ్ళ తర్వాత కూడా జీవితాన్ని ప్రభావితం చేస్తూ అనుపమ హృదయం కరిగి కన్నీటిని వర్షిస్తూంది. ఆవేదనను తొక్కిపెట్టి క్యాబ్ కిటికీ లోంచీ ఆకాశహర్మ్యాలను చూస్తోంది అనుపమ.

'తనిక ఆడపిల్ల తల్లిగా తప్ప, ఆడపిల్లగా జీవితాన్ని విశ్లేషించలేదా! మహిత భవిష్యత్తు తన నిర్ణయాల మీదే ఆధారపడి వుందా? మిళింద్ మరో ఆనంద్‌గా మారిపోతాడా!' ఎడతెగని ఆలోచనల్లో యాభై కిలోమీటర్ల దూరం ప్రయాణం ఎలా గడిచిందో తెలీలేదు.

మానసికంగా నిర్వేదంలో కూరుకుపోయి అన్యమనస్కంగానే నెట్ 'బ్రౌజ్' చేసింది అనుపమ. కొత్త మెసేజ్ వచ్చింది.

మహిత నుంచి.

''అమ్మా! నువ్వూ అమ్మమ్మ మాట్లాడుకునే మాటలన్నీ నేనూ విన్నాను, పార్లల్ ఫోన్‌లో. నువ్వు నా గురించి ఆలోచించి మిళింద్ అంకుల్‌కి దూరం చేసుకోమని అమ్మమ్మ చెప్తోంది కదూ? నీకా భయం అక్కర్లేదమ్మా! నాన్న చేసిన అన్యాయం నాకు నువ్వు చెప్పావు. నీ అమాయకత్వం కూడా నాకప్పుడు అర్థమయింది. అమ్మా! అమ్మమ్మ ప్రక్క ఊరికి వెళ్ళాలన్నా తోడు లేనిదే వెళ్ళదు. మరి నువ్వో! అమెరికా దాకా ఒంటరిగా వెళ్ళావు. ఇక మేము అంతరిక్షానికి వెళ్ళే దారులు వెతుకుతున్నాం. మా తరానికి సహజంగా లభించిన అవకాశాలే ధైర్యాన్ని, ఏ ఆపదనైనా ఎదుర్కొనే తెగింపునీ ఇచ్చాయి. నా విషయంలో అయితే నీ జీవితమే నాకొక లెసన్. అందుకే ఇంకా ఆలోచిస్తూ అంకుల్‌ని దూరం చేసుకోకు. అంకుల్ లాంటి నాన్న వుంటే బావుంటుందని నాకు చాలా రోజుల్నించీ అనిపిస్తోంది. మరోమాట. తాతయ్య భగవద్గీత చదువుతూంటే విన్నాను. కర్మ చెయ్యడమే మన విధి అనీ, దాని ఫలితం భగవంతుడి ఇష్టం అనీ, ఏది జరిగినా ఆయన ఇష్టానుసారమే జరుగుతుందనీ! అది నిజంగా నిజమే కదమ్మా! నిన్ను రక్షించాలని ఎంత మంది ప్రయత్నించినా, నువ్వు పొరపాటు పడ్డావు కదా! అలాగే నన్ను నీ కళ్ళల్లో వుంచి కాపాడుకోవాలనుకున్నా, నా మనసు నా మాట విననప్పుడు నువ్వేం చేయగలవు? ఎలా రక్షించగలవు? అమ్మా! పెద్ద మాటలు మాట్లాడుతున్నానని కోపం వచ్చిందా! చివరగా ఓ మాట. నాకు నువ్వు అమెరికా నుంచి తేవాల్సిన గిఫ్ట్ ఏంటగో తెలుసా! ''నాన్న''.

మెయిల్ ఆసాంతం చదివాక తన కూతురే తన కన్నా పెద్దదేమో అన్న అనుమానం వచ్చింది అనుపమకి.

జీవితం పట్ల దానికున్న అవగాహన, ధైర్యం, తనలో కలిగిస్తున్న స్థైర్యం ఇవన్నీ మహితకి తను నేర్పి పాఠాలు కావు. ఈ తరానికి సమాజం నేర్పుతున్న నవజీవన ప్రబోధాలు.

'తనకిది చాలు. మిళింద్ పట్ల మహితకున్న అభిమానం చాలు. ఏడాది నుంచీ కలిసిమెలిసి తిరుగుతున్న మిళింద్, మహితని ఆదరిస్తూన్న విధానం చాలు. కూతురు తన కందించిన మానసిక ధైర్యం చాలు'.

కేబిన్‌లోని వెనీషియన్ బ్లైండ్స్ తొలగించి వినీలాకాశాన్ని పరికించింది అనుపమ. నిర్మలాకాశంలో వెండిమేఘం ఒకటి ఆమె హృదయంలాగే మెరుస్తూ పయనిస్తోంది. చల్లని ఓ గాలి తెమ్మెర, మిళింద్ స్పర్శలా ఆమెను స్పృశిస్తోంది.

★

